ప్రజాశక్తి
శనివారం 18 అక్టోబరు 2025
5
శ్రీకాకుళం

వికలాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వికలాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించే వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై జిల్లావ్యాప్తంగా 11 వినతులు వచ్చాయి. వికలాంగులు ప్రస్తావించిన సమస్యలకు సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

కూటమిలో ఆరని మంటలు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే లేకుండానే జి.సిగడాంలో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన
- లావేరు, జి.సిగడాంలో పంట కాలువల పరిశీలన
- లావేరులో జనసేన రీజనల్ కార్యాలయం ప్రారంభం
- ఐదు నియోజకవర్గాలు లక్ష్యంగా కార్యకలాపాలు

జిల్లాలో ఎమ్మెల్సీ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు రెండు రోజుల పర్యటన కూటమిలో మంటలను రేపుతోంది. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కర్నూలు సభకు వెళ్లిన సమయంలో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను పరిశీలించడం, అధికారులతో సమీక్ష నిర్వహించడం తెలిసిందే. ఇక్కడేదో కాకతాళీయంగా జరిగిందిలే అని సర్దుకున్నా, ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ అదే సీన్ రిపీట్ అయింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు నియోజకవర్గంలో అందుబాటులో లేని సమయంలో నియోజకవర్గంలోని లావేరు, జి.సిగడాం పరిధిలోని పంట కాలువలను పరిశీలించడంపై అటు బిజెపి శ్రేణులూ మండిపడుతున్నాయి. వచ్చే ఎన్నికల కోసం ఒక వ్యూహం ప్రకారమే జనసేన ఇలా వ్యవహరిస్తోందన్న చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇప్పటివరకు జిల్లాలో ప్రశాంతంగా సాగిపోతున్న కూటమిలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు జిల్లా పర్యటన కుంపట్లను రాజేసింది. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు లేకుండానే పర్యటించడం, సమీక్షలు నిర్వహించడంతో పాటు ప్రజలను కలుసుకోవడంపై కూటమి భాగస్వామ్య పక్షాల్లోని టిడిపి, బిజెపి శ్రేణులు అగ్గి మీద గుగ్గిలమవుతున్నాయి. కూటమిలో ఉంటూనే పొత్తు ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడుతున్నారు. ఎమ్మెల్సీ నాగబాబుకు రాజకీయ అవగాహన లేకనో, అపరిపక్వ రాజకీయమో అనుకుంటే తప్పులో కాలేసినట్లే. వచ్చే ఎన్నికలకు ఒక పద్ధతి ప్రకారం పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేసే భాగంగానే చూడాల్సి ఉంటుందని పార్టీ సీనియర్ నాయకులు చెప్తున్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఈ ఏడాది ఆగస్టులో విశాఖలో మూడు రోజుల పాటు 'సేనతో సేనాని' కార్యక్రమంలో భాగంగా తీసుకున్న నిర్ణయాలనే ఎమ్మెల్సీ నాగబాబు అమలు చేస్తున్నట్లుగా ప్రస్తుత పరిణామాలను బట్టి తెలుస్తోంది. కూటమి ఐక్యతను కాపాడుకుంటూనే, పార్టీ స్వతంత్రంగా ఎదగడానికి పనిచేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల నాయకులకు దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయి పర్యటనల్లో కూటమిలోని భాగస్వామ్య పక్షాలు లేకుండా తామే నేరుగా ప్రజల్లోకి వెళ్తే ఫోకస్ అవుతామని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కలిసి పనిచేయాలి, ప్రజా సమస్యల విషయంలో ఒంటరిగా వెళ్లాలనే వ్యూహంలో భాగంగానే ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన సాగిందనే చర్చ సాగుతోంది.

రీజనల్ కార్యాలయం ఏర్పాటు వెనుక వ్యూహం అదేనా?

నాగబాబు పర్యటన రెండో రోజు మరో రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. లావేరులో జనసేన ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఐదు నియోజకవర్గాల బాధ్యత తీసుకోవాలంటూ ఇటీవల పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సూచించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఎమ్మెల్సీ నాగబాబుకు శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, ఎచ్చెర్ల, రాజాం నియోజకవర్గాలు అప్పగించినట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో ఇక్కడ నుంచే జన సైనికులకు దిశానిర్దేశం చేయనున్నారు. అందుకనుగుణంగా లావేరులో ప్రైవేట్ స్థలాన్ని అద్దెకు తీసుకుని తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికలకు పార్టీని సిద్ధం చేస్తూనే, ఎచ్చెర్ల నుంచి ఎమ్మెల్సీ నాగబాబు పోటీ చేస్తారని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు.

నాగబాబు తీరుపై సొంత పార్టీలోనే అసంతృప్తి

ఎమ్మెల్సీ నాగబాబు తీరుపై సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. స్థానిక ఎమ్మెల్యేలు లేకుండానే నియోజకవర్గాల్లో పర్యటించడమేమిటంటూ అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న తమను సైతం నాగబాబు పర్యటనకు పిలవకుండా విస్మరించడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్‌ను సైతం ఎచ్చెర్ల నియోజకవర్గ పర్యటనకు పిలవకపోవడం పార్టీలో నెలకొన్న సమన్వయ లోపానికి అద్దం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ నాగబాబును జిల్లాకు చెందిన ఇద్దరు, ముగ్గురు నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారంటూ సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, పాతపట్నం నియోజకవర్గ సమన్వయకర్త గేదెల చైతన్య వ్యవహారశైలిపై జనసైనికులు మండిపడుతున్నారు. మొత్తమ్మీద నాగబాబు పర్యటన అటు కూటమి పార్టీలో చిచ్చు రగిలించగా, సొంత పార్టీ శ్రేణుల్లోనూ అసంతృప్తికి దారితీసింది.

జనసేన రీజనల్ కార్యాలయం ప్రారంభం

జనసేన రీజనల్ కార్యాలయన్ని ప్రారంభిస్తున్న నాగబాబు

లావేరు : మండల కేంద్రంలో జనసేన పార్టీ రీజనల్ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు శుక్రవారం ప్రారంభించారు. కార్యాలయం అంతా కలియతిరిగి పార్టీ ముఖ్య నాయకులతో ముచ్చటించారు. అనంతరం జి.సిగడాం మండలం పర్యటనకు వెళ్తుండగా స్థానికులు ఆయన వాహనాన్ని ఆపి తమ సమస్యలను విన్నవించారు. బుడుమూరు పెద్దగెడ్డ వంతెన లేకపోవడంతో వర్షాలు పడినప్పుడు వరద నీటి ప్రవాహంతో సుమారు పది గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వంతెన నిర్మించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జి.సిగడాం పర్యటనకు వెళ్లారు. కార్యక్రమంలో జనసేన ఎచ్చెర్ల ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, గేదెల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను తెలంగాణ రాష్ట్రంలో చేసినట్లుగా సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ నగరంలోని ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యంతో చర్చలకు తమని ఆహ్వానించాలన్నారు. ఉద్యోగులకు జెఎల్ఎం గ్రేడ్-2 సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డిఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు 2022 పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని, షిఫ్ట్ ఆపరేటర్లు అందరికీ ఒకే వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లు, స్టోర్ హమాలీలకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. అపరిమిత వైద్య సదుపాయం, రూ.కోటి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో పోరాట కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీపాన నరసింహమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నాయకులు కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, ఎ.సత్యనారాయణ, ఆర్.ప్రకాష్, ఎం.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దీపావళి టపాసులు విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సంబంధిత అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. షాపుల వద్ద ఎవరూ నిద్రించరాదని, బ్యారల్స్‌లో నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అగ్నిమాపక సాధనాలని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కాకుండా షాపుల వద్ద పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాత్కాలిక అనుమతులు ఇచ్చే ముందు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేయాలని ఎస్‌పి మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆర్‌డిఒలు కె.సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో కక్షసాధింపు

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి - పలాస

రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. పలాసలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటికి వెళ్లి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపు చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలు పెచ్చుమీరాయని, వైసిపి నాయకులు, కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైసిపి చేపడుతున్న నిరసన కార్యక్రమాలపై పోలీసులను ఉపయోగించి నిర్బంధాలు విధిస్తోందన్నారు. పలాసలో కల్తీ మద్యానికి వ్యతిరేకంగా చేస్తున్న నిరసన ర్యాలీని అడ్డుకుని కేసులు పెట్టడం సరికాదన్నారు. మాజీ మంత్రి అప్పలరాజు, వైసిపి కార్యకర్త వేణుగోపాల్ రెడ్డిపై కేసులు పెట్టడాన్ని ఖండించారు. తప్పుడు కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు తప్పుడు కేసులు పెడితే సహించేది లేదన్నారు. కూటమి ప్రభుత్వ అణచివేత ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెప్తారన్నారు. సీదిరిని కలిసిన వారిలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి తదితరులున్నారు.

కిడ్నీ వ్యాధితో గిరిజన మహిళ మృతి

ప్రజాశక్తి - పలాస

జమున మృతదేహం

కిడ్నీ వ్యాధితో మండలంలోని లొద్దభద్ర పంచాయతీ పొత్రియ గ్రామానికి చెందిన సవర జమున గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. జమున కొన్ని నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ పలాసలోని సామాజిక ఆస్పత్రి, కిడ్నీ ఆస్పత్రిలో చికిత్స పొందింది. మెరుగైన చికిత్స చేయించుకోవడానికి ఆర్థికస్తోమత లేక వ్యాధితో పోరాడుతూ ఇంట్లోనే కన్నుమూసింది. ఆమె భర్త అంగవైకల్యం కావడంతో కుటుంబ భారమంతా ఆమే మోసేది. ఆమె కుమార్తె పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ఆమె మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు కోరారు.

నేడు క్లస్టర్ సమావేశాలు

ప్రజాశక్తి - టెక్కలి

విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యాన క్లస్టర్ సమావేశాలు శనివారం నిర్వహించనున్నారు. విద్యాశాఖ అకడమిక్ కేలండర్ ప్రకారం అక్టోబరు నెలకు సంబంధించిన క్లస్టర్ సమావేశాలు యధావిధిగా శనివారం రెండో పూట నిర్వహించనున్నారు. ఎఫ్ఎ-2 పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో ఈ క్లస్టర్ సమావేశాల్లో పరీక్షల విభాగంపై ఉపాధ్యాయులు చర్చించుకునేందుకు అవకాశం కలుగుతుంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం టైమ్ టేబుల్‌ను ఆసరాగా చేసుకొని సముదాయాలు నిర్వహించనున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గురుకుల హాస్టళ్ల పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో అత్యవసరంగా చేయాల్సిన పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న పనుల ప్రగతిపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని తొమ్మిది గురుకులాలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణాలపై ఆదేశాలు జారీ చేశారు. కొల్లివలసలో మోడ్రన్ కిచెన్ కోసం రూ.15 లక్షలు, పలాసలో మరమ్మతులకి రూ.10 లక్షలు అవసరమని అధికారులు తెలిపారు. నందిగాం హాస్టల్‌లో రూ.1.79 కోట్లతో చేపడుతున్న డైనింగ్ కం కిచెన్ హాల్ నిర్మాణం, తరగతి గదుల నిర్మాణాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని గడువు విధించారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని హాస్టల్స్‌లో పారిశుధ్యం, మంచినీటి సౌకర్యం సరిగా లేదని ఫిర్యాదులు రావడంతో, ఆ సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతి నివేదికలు సమర్పించాలని సూచించారు. వసతులు మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నిర్వహణ ఉండాలన్నారు. నిరంతరం వసతిగృహాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఇఇ బి.రామకృష్ణ, డిఇఇ బి.శ్రీరాములు, జిల్లా కో ఆర్డినేటర్ వై.యశోదలక్ష్మి, పలు హాస్టళ్ల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వీధి వ్యాపారుల ఆర్థిక స్థిరత్వానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ ఎస్.వెంకటరావు తెలిపారు. పిఎం స్వానిధి పథకంపై మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డుల మంజూరు, రుణ సౌకర్యంతో పాటు కొత్తగా క్రెడిట్ కార్డు పాలసీ అమలు చేయనున్నట్లు చెప్పారు. స్వయం ఉపాధి లక్ష్యంగా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఎం.నారాయణ డిజిటల్ పేమెంట్ విధానంలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో సిఎంఎం జి.కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'పిఎం సూర్యఘర్' ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు పూర్తి వివరాలు అందించేందుకు ఈనెల 18న ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఇపిడిసిఎల్) సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రత్యేక కౌంటర్లలో విద్యుత్ సిబ్బంది, సోలార్ వెండార్స్, బ్యాంకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వినియోగదారులు హాజరై సోలార్ రూఫ్ టాప్ సందేహాలను నివృత్తి చేసుకొని, వారి ఇళ్లపై ఏర్పాటు చేసుకోవాలని కోరారు. జిఎస్‌టి 2.0 సంస్కరణల్లో భాగంగా రూఫ్ టాప్ సామగ్రి ధరలు రూ.లక్షకు రూ.ఏడు వేల వరకు తగ్గిందని తెలిపారు.

పిఎం సూర్య ఘర్ యోజన పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 2,938 మంది లబ్ధిదారులు సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకుని తమ నెలవారీ విద్యుత్ బిల్లులను తగ్గించుకున్నారని ఎస్ఈ వివరించారు. మరిన్ని వివరాలకు www.pmsuryaghar.gov.in గానీ ఇపిడిసిఎల్ వెబ్‌సైట్‌లో pmsuryaghar వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం, మరింత సమాచారం కోసం 1912 టోల్ ఫ్రీ నంబరుకు సంప్రదించాలని సూచించారు.

వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పలాస

అర్జీల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని ప్రాంతాల కోసం ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పౌర సంబంధ, కుటుంబ, ఆస్తి గొడవలు, మోసపూరితమైన ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. వినతులను స్వీకరించిన ఎస్‌పి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

NOTICE ORDER-21 RULE-54(1A) OF C.P.C.IN THE HON'BLE COURT OF THE 4TH ADDITIONAL DISTRICT JUDGE CUM SC & ST COURT AT SRIKAKULAM.

EP:308/2024 in AR.C NO: D918658231

BETWEEN:
APAC Financial Services Pvt. Ltd., having registered office at Office-501, South Annexer Tower, Lower Parel, Mumbai-400013, and having its branch office at Plot No-3, Visakha-B Colony, Near SBI Branch, Srikakulam-532001, rep. by G. Balakrishna ....DHR
AND
R1) Yarra. Suryanarayana
R2) Yarra. Aruna Kumari, W/o Suryanarayana, Both having same address at D.No: 1-223, Colony, Uppinivalasa Village, Burja Mandal, Srikakulam District ...JDR

NOTICE

ఇందుమూలంగా పైన తెలిపిన JDRలకు తెలియజేయునది ఏమనగా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా సక్రమంగా చేరకపోవడం లేదా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ 4th Addl. Dist. Judge Cum SC & ST Court - శ్రీకాకుళం వారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది. సదరు పై నంబర్ పిటీషన్‌లో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా స్వయముగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని 31.10.2025 ఉ.గ.10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

CH. సూర్యనారాయణ
అడ్వకేట్, శ్రీకాకుళం.

వృద్ధులను పరామర్శిస్తున్న హరిబాబు

వయోవృద్ధులు ఆదర్శప్రాయులు

ప్రజాశక్తి - అరసవల్లి

వయోవృద్ధులు సమాజానికి ఎప్పుడూ భారం కాదని, వారు భావితరాలకు మార్గదర్శకులు, ఆదర్శప్రాయులని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. వృద్ధులను ఆశ్రమాల్లో చేర్చడం బాధాకరమని పేర్కొన్న ఆయన, వారికి న్యాయ సహాయం అందించడంలో డిఎల్ఎస్ఎ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని భరోసా ఇచ్చారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని శాంత అనురాగ నిలయం వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీనియర్ సిటిజన్ చట్టంతో పాటు వివిధ పథకాల ద్వారా వారికి అందాల్సిన ప్రయోజనాలను, న్యాయ సహాయాన్ని అందించడంలో సంస్థ ముందుంటుం దన్నారు. వయోవృద్ధులకు ఏ చిన్న సమస్య వచ్చినా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధిగ్రస్తులను సైతం పరామర్శించారు.

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సక్రమంగా విధులు నిర్వహించాలి

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - మందస

'మందస మేజర్ పంచాయతీలో అన్నీ సమస్యలే' అనే శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి డిఎల్‌పిఒ కె.సౌజన్య, ఇఒ రమణ స్పందించారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీలో ఉన్న సచివాలయానికి వెళ్లి రికార్డులు తనిఖీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా ఉండకూడదని, విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయానికి సమయానికి హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - పలాస

పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో రూ.3 లక్షలు వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సిసి రోడ్డుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చైర్మన్‌గా పనిచేసిన నాలుగున్నర ఏళ్లలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా రహదారులు, కాలువలు నిర్మాణం చేపడుతున్నా మన్నారు. ఇంటింటికి తాగునీరు అందించడం వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. స్థానిక కౌన్సిలర్లు తమ దృష్టికి తెచ్చిన, సమస్యలతో పాటు, తన పర్యటనలో గుర్తించిన సమస్యలను కూడా పరిగణలోనికి తీసుకొని అన్ని వార్డులకు సమాన ప్రాతిపదికన నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఉన్న కాలంలో కూడా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఈ పాలకవర్గానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తానని, దీనిని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్ మూల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ హాస్టల్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

హాస్టల్‌లో వసతులు మృగ్యం

రణస్థలం: ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో వసతులు లేక, ధరలకు అనుగుణంగా మెనూచార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ అమ్మన్నాయుడు, రణస్థలం శాఖ కార్యదర్శి వెలమల రమణ అన్నారు. శుక్రవారం రణస్థలం బిసి సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి పరిశీలించారు. విద్యార్థులు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. విద్యార్థుల గదులు, భోజన శాలలో స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయని, విద్యార్థులు భయంభయంతో ఉన్నారని, వర్షం పడితే హాస్టల్ గదుల్లో నీరు కారిపోతుందని, విద్యార్థులు జాగారం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దోమలతో విద్యార్థులు సావాసం చేస్తున్నారని, దీనివలన విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, శుద్ధి చేసిన మంచినీరు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

శ్రీకాకుళం సిటీ, నరసన్నపేట: గౌరీ పౌర్ణమి నందిన్న ఉత్సవాల్లో డిజె సౌండ్‌కు ఇంటి పైకప్పు కూలి తీవ్ర గాయాలపాలై విషమ పరిస్థితిలో ఉన్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎ.రాధ, ఆమె కుమార్తెకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కె.నాగమణి, ఎపి మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర డిమాండ్ చేశారు. ఈ నెల 15న రాత్రి నరసన్నపేట భవానిపురంలో నందన్న ఉత్సవాలు సందర్భంగా పెద్దపెద్ద శబ్దాలతో డిజే సౌండ్ వలన ఇంటి పైకప్పు కూలి తీవ్ర గాయాలపాలై విశాఖపట్నం కెజిహెచ్ ఐసియులో చికిత్స పొందుతున్న వారిని, వారి కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు రాధకు స్పృహ లేదని, వారి కుమార్తెకు వెన్నుఎముక విరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి జిల్లా మంత్రులు, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి వైద్యం అందించి, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

చెరువులో అక్రమ నిర్మాణాలు తొలగింపు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని లోలుగు కుర్మయ్యగుండం చెరువు గర్భంలో పలువురు స్థానికులు చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ, పోలీసులు తొలగించ డంతో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. గ్రామంలోని సర్వే నెంబర్ 111లో 5.44 ఎకరాల విస్తీర్ణంలో కుర్మయ్యగుండం చెరువు ఉండగా ఇందులో సుమారు 25 సెంట్లు స్థలంలో గ్రామానికి చెందిన పలువురు చేపట్టిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని గ్రామానికి చెందిన లోలుగు కామరాజుతో పాటు మరికొందరు తహశీల్దార్ ఆర్.వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు చెరువు గర్భంలో పెద్ద నిర్మాణంతో పాటు పలువురు కొంతభాగం ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించి అక్రమ నిర్మాణాలు తొలగించాలని 17 మందికి నోటీసులు అందజేశారు. నోటీసులకు స్పందించకుండా చెరువు గర్భంలో అక్రమ నిర్మాణాలను తొలగించక పోవడంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారి ఆదేశాల మేరకు తహశీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు జెసిబి సాయంతో అక్రమ నిర్మాణాలను తొలగింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా పోలీసులను మోహరించారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు పలువురు ప్రయత్నించడంతో తహశీల్దార్,

జెసిబితో తొలగిస్తున్న అక్రమ నిర్మాణాలు

సిఐ పి.సత్యనారాయణలు హెచ్చరించారు. అక్రమ నిర్మాణాల తొలగింపుతో వివక్షత చూపుతున్నారని అధికారులతో పలువురు వాదించారు. గ్రామానికి చెందిన పిసిని శ్యామల రావు 15 ఏళ్లగా పెద్ద నిర్మాణం చేసుకుని పిండిమిల్లు పెట్టి జీవనం సాగిస్తున్నామని అధికారులకు తెలిపారు. గ్రామానికి చెందిన లోలుగు కామరాజు ఈ పెద్దను తొలగించాలని తమకు ఇబ్బంది పెడుతూ, దౌర్జన్యం చేస్తున్నారని ఈ విషయంపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులకు తలొగ్గి తమ నిర్మాణాలను తొలగించారంటూ ఆరోపించారు. తొలగింపు కార్యక్రమంలో సర్వేయరు గణపతి, ఎస్ఐలు వి.సత్యనారాయణ, జి.బాలరాజు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చైర్మన్ గిరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్ రెండవ వీధిలో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వీధివాసులు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. చైర్మన్ గిరిబాబు శివాజీనగర్‌లో పర్యటించగా తూర్పుకు ఉన్న రెండవ వీధికి చెందిన మహిళలు, వీధి పెద్దలు ఆయనను కలిసి తమ రోడ్డు దుస్థితిని వివరించారు. శివాజీనగర్‌లో ఎన్నో వీధుల్లో రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ ప్రారంభంలో ఉన్న రెండవ వీధిలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడం విచారకరమన్నారు. తమ వీధిలో రోడ్డుపై రాళ్లు తేలిపోయి ఉండడం వల్ల వాహనదారులు పడిపోవడంతో పాటు, వృద్ధులు నడిచి ప్రయాణం చేయలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పాటి వర్షానికి కూడా చెరువులా తలపిస్తుందన్నారు. దీనిపై తక్షణమే స్పందించిన చైర్మన్ ఇంజినీరింగ్ అధికారులకు ఫోన్ చేసి ఈ వీధిలో ఎందుకు రోడ్డు వేయలేక పోయామని వివరాలు అడిగి తెలుసు కున్నారు. అయితే గతంలో రోడ్డు మంజూరు చేసి సిఆర్ జరిగిందని, టెండర్లు పిలవడంలో జాప్యం జరిగిందని ఎఇ కిరణ్ వివరించడంతో తక్షణమే ఈ రహదారి నిర్మాణానికి టెండర్లు పిలవాలని ఆదేశించారు. నెలరోజుల్లో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగు తుందని ప్రజలకు చైర్మన్ హామీ ఇవ్వడంతో వీధి ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు డబ్బీరు నాగు, వీధివాసులు, మహిళలు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో విద్యార్థులకు సిపిఆర్, ప్రథమ చికిత్సలపై అవగాహన కార్యక్రమాన్ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది చేపట్టారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో రోగికి తక్షణం అందించాల్సిన సిపిఆర్ విధానం, ప్రమాద సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్సలు వంటి సమస్యలపై ప్రాథమిక జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి సిబ్బంది డి. మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సలపై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సూపర్‌వైజర్ ఎస్.లక్ష్మీబాయి, సిబ్బంది రుక్మిణి, హైమావతి, శైలజ, నిర్మల తదితరులు పాల్గొని విద్యార్థులకు ప్రదర్శనాత్మక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్ సాహు, అధ్యాపకుడు గొండు శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రణస్థలం: మండల కేంద్రంలో సూర్య ఆస్పత్రి, సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి శ్రీకాకుళం సౌజన్యంతో సిపిఆర్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఇడదాసుల వెంకట సత్యనారాయణ, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కె. రవితేజ, బాలనరసింహారావు, సూర్య ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఇడదాసుల యశ్వంత్, స్థానిక సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె. క్రాంతికుమార్, ఎం.యుగంధర్ తదితరులు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలు అనర్థం

శ్రీకాకుళం సిటీ: బాల్య వివాహాలు నిర్మూలించాలని సర్వ శిక్షా అభియాన్ ఎపిసి శశిభూషణ్ తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాలు సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి సూర్య మహల్ జంక్షన్ వరకు బాలికలతో బాలికల రక్షణ, హక్కులు, బాల్యవాహల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సూర్యమహల్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ర్యాలీ ప్రారంభానికి ముందు బాలికల రక్షణకు మద్దతుగా పాల్గొన్న అందరితో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం బాలికల రక్షణకు సంబంధించి రెండు రకాల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఐ.విమల మాట్లాడుతూ అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురష్కరించుకొని ఈ నెల 11 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో, విద్యా సంస్థల్లో బాలికల రక్షణకు సంబంధించి వ్యాసరచన,

ర్యాలీలో పాల్గొన్న బాలికలు, అధికారులు

డ్రాయింగ్, సాంస్కృతిక, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను మండలస్థాయి కార్యక్రమాలల్లో అందజేసినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో బాలికల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ యు.శ్రీలక్ష్మి, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ డి. ఉమామహేశ్వరి, నోడల్ అధికారి కె.మణమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మీడియా స్వేచ్ఛను ప్రభుత్వం నియంత్రిస్తుందని జర్నలిస్టు, పౌర సంఘాలు ఆధ్వర్యంలో ఏడురోడ్ల కూడలిలో శనివారం నిరసన తెలియజేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శించారు. పత్రికల్లో వస్తున్న వార్తలకు సంబంధించి ఆధారాలు చూపమనడం, నోటీసులు ఇవ్వటం, ఎడిటర్, రిపోర్టింగ్ నెట్‌వర్క్‌ను హింసించటం అన్యాయమన్నారు. అనంతరం శ్రీకాకుళం డిఎస్‌పి వివేకనందకు వినతిపత్రం అందజేశారు. భవిష్యత్‌లో ప్రభుత్వ తీరు మారకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్రకార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఎపిజెఎఫ్ రాష్ట్ర నిర్వాహన కార్యదర్శి ఎస్.జోగినాయుడు, యూనియన్ నాయకులు రవి, తైక్వాండో శ్రీను పాల్గొన్నారు.

నరసన్నపేట: పత్రికా స్వేచ్ఛను హరించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. శుక్రవారం నరసన్నపేట పాత్రికేయుల సంఘం నాయకులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో మోహన్ చంద్ర దేవ్, రవి, షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసులు వేధింపులు, అక్రమ కేసులు పెట్టి పత్రికాస్వేచ్ఛను హరిస్తున్నారని నిరసన తెలియజేస్తూ తహశీల్దార్ వెంకట రావు, సిఐ మీసాల చిన్నంనాయడుకు ప్రెస్‌క్లబ్ తరుపున మీడియా ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

టెక్కలి: మీడియా స్వేచ్ఛపై ఆంక్షలు తగవని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు అన్నారు. ఆర్‌డిఒ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు ఎం షణ్ముఖరావు, వైసిపి నాయకులు తమన్న గారి కిరణ్ కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘ నాయకులు బెండి నరసింహారావు, కూన సుదర్శనరావు, సత్తార్ రాజశేఖర్, వాసుదేవరావు, వెంకటరమణ, పాపారావు, శివ రంగబాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.

పలాస: సాక్షి మీడియాపై చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ప్రింట్, మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆర్‌డిఒ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహారణ, జగదీష్, నేతాజీ, రాజారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులను నిరసిస్తూ నాలుగు రోడ్ల కూడలి వద్ద జర్నలిస్టులు నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కె.బాలకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాత్రికేయులు అల్లు నరసింహా రావు, ఎస్.శ్రీనివాసరావు, ఎల్.అనందరావు, రామకృష్ణ, పి.గోవిందరావు, జి.రాంబాబు, వై.రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం సరికాదని వైసిపి జిల్లా నాయకులు పాలిన శ్రీనివాసరావు, కౌలు రైతులు సంఘం జిల్లా నాయకులు బమ్మిడి ఆనందరావు అన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు తిరి రాజారావు, ఉపాధ్యక్షుడు దున్న బాలరాజు, దేవా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం

వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - కవిటి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపడుతున్న కోటి సంతకాల సేకరణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని లండారిపుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగలో నిర్వహించిన 'రచ్చబండ' కార్యక్రమం వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. వాటిని ప్రైవేటుపరం చేస్తే, పేద ప్రజలకు ఉచిత వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జగన్ ఆదేశాల మేరకు ప్రజా ఉద్యమం ప్రారంభించామని తెలిపారు. ఈ పోరాటానికి ప్రతి పౌరుడి సంతకం అవసరమన్నారు. అనంతరం శవాసనపుట్టుగకు చెందిన టిడిపి కార్యకర్తలు దుర్గాసి కృష్ణారావు, మట్ట బూసయ్య, నర్తు కొయిరయ్య వైసిపిలో చేరారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, పూడి నేతాజీ, నర్తు నరేంద్ర యాదవ్, పిలక రాజ్యలక్ష్మి, శాడి శ్యాంప్రసాద్ రెడ్డి, భారతి దివ్య, ఇప్పిలి కృష్ణారావు, పట్నాయక్, యలమంచి నీలయ్య, సర్పంచ్‌లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

పలాస: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. మండలంలోని రంగోయిలో శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం, రచ్చబండ, సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు అవకాశాలు లేకుండా పోయాయన్నారు. కార్యక్రమంలో మామిడిమెట్టు సర్పంచ్ సూర్యకుమారి, పార్టీ మండల అధ్యక్షులు దువ్వాడ రవి, జిల్లా


కవిటి : మాట్లాడుతున్న కృష్ణదాస్

కార్యదర్శి బత్తిన హేమేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు చింతాడ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మందస : మండలంలోని బాహడపల్లిలో ఎంపిపి డొక్కరి దానయ్య అధ్యక్షతన రచ్చబండ, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడుతున్న ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కొత్త కార్మికులను నియమించటానికి డబ్బులు డిమాండ్ చేస్తున్న టెండర్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఆర్.ప్రకాశరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో కాలువలు, రోడ్లు, జనాభా పెరిగిన నేపథ్యంలో పట్టణ అవసరాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించామని చెప్పారు. ఈ నేపథ్యంలో 80 మంది కొత్త కార్మికులను టెండర్ ద్వారా నియామకాలు చేయడానికి సంబంధించి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. టెండర్ సంపాధించిన ఏజెన్సీ ప్రతినిధులు కొత్త కార్మికులను వేసుకోవడానికి ఒక్కో కార్మికుని నుంచి రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే నగరపాలక సంస్థలో 279 జిఒ పేరుతో తొలగించిన వారికి, బదిలీ కార్మికులకు ఎటువంటి డబ్బులు అడగకుండా కార్మికుల కుటుంబ సభ్యులను కొత్త

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

కార్మికులుగా నియామకాలు చేయాలని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మిక కుటుంబాల పిల్లలకు అప్కాస్ ద్వారా ఉద్యోగాలు కల్పించాలన్నారు. పెద్ద కాంపాక్ట్ బిన్‌లకు చక్రాలు ఏర్పాటు చేయాలని, మరమ్మతులు చేయాలని కోరారు. లేని పక్షంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. చెత్త ఎత్తే ట్రాక్టర్లు తొట్టెలు బాగు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో డి.యుగంధర్, డి.చిట్టి, ఎ.శంకర్, ఎ.మోహన్, ఎ.రాము, కె.గణేష్, ఎ.జ్యోతిప్రసాద్, పార్వతి, ఎన్.పార్వతి, ఆర్.ఈశ్వరమ్మ, డి.సరోజ తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా అక్రమ నిల్వలుంటే చర్యలు

ప్రజాశక్తి - కొత్తూరు

అనుమతి లేకుండా బాణాసంచా అక్రమ నిల్వలు ఉన్నా, తయారు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని సిఐ చింతాడ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఎవరికైనా ఇబ్బందులు కలిగే విధంగా బాణాసంచా కాల్చితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగు జాగ్రత్తలతో బాణా సంచా కాల్చాలన్నారు.

నేడు సోలార్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సోలార్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ వాడకం, ప్రయోజనాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమానికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

నరసన్నపేట : స్థానిక మేజర్ పంచాయతీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఇందిరానగర్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నుంచి 15వ ఆర్థికసంఘం అంటైడ్ నిధులు నుంచి రూ.లక్షతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిట్టిబాబు, సతీష్, రామారావు, సంతోష్, భారతి, స్థానికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి - మందస

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులను, సమాజాన్ని ఉన్నంతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. శుక్రవారం మందస మండలం బైరిసారంగపురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన ప్రభాకర్ పట్నాయక్ మాస్టార్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని స్థానిక ఎపిటిఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే మండలం నుంచి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కర్రి సుందరరావు, గున్న రాజులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మందస ప్రధాన కార్యదర్శి కె.సుందరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు వి.వి వరప్రసాద్, ఎన్.కరుణాకర్, డి వైకుంఠరావు, బి.మురళీమోహన్, బి.తిరుపతిరావు, బి.బైరాగి, సుశాంత్ కుమార్ రౌలో, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హరిత దీపావళి చేసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దీపావళి పండుగను హరిత దీపావళిగా మనమంతా జరుపుకోవాలని ఎపి ఎన్.జి.సి.కోఆర్డినేటర్, జనవిజ్ఞాన వేదిక పర్యావరణ సబ్‌కమిటీ కన్వీనర్ పూజారి గోవిందరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. హరిత దీపావళి అంటే పర్యావరణాన్ని కాపాడుతూ, ఆరోగ్యాన్ని కాపాడుతూ పండుగ జరుపుకోవడం. ఎక్కువ శబ్దం వచ్చే పటాకులు కాల్చకుండా దీపాలు, కొవ్వొత్తులు వెలిగించడం, కుటుంబ సభ్యులు, మిత్రులతో చెట్లు నాటడం వలన వాయు కాలుష్యం తగ్గుతుందన్నారు. పిల్లలకు సాంప్రదాయాలను తెలియజేయాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

సింహాద్రినాయుడు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ మాజీ సర్పంచ్ హనుమంతు సింహాద్రి నాయుడు (85) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం విజాంపాడులో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భార్య ఇప్పటికే మృతి చెందగా ముగ్గురు కుమారులు శేషగిరి, సుబ్రమణ్యం, తేజేశ్వరరావు ఉన్నారు. ఆయన మృతిపై సర్పంచ్ గురువెల్లి కేశవరావు, మాజీ సర్పంచ్ పూజారి శైలజ, గ్రామపెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

వెండి చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలోని భయ్యనతోట ప్రాంతంలో శుక్రవారం వెండి చోరీ జరిగింది. విశ్రాంత అధ్యాపకుడు సంపతి పురుషోత్తం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లారు. ఇంటికి వచ్చేసరికి బీరువా తెరిచి ఉండడంతో పరిశీలించగా 300 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఆయన రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సిఐ ఈశ్వరరావు సంఘటనను పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సిఐకు వినతిపత్రం అందజేస్తున్న రాజేష్

గంజాయి ముఠాలపై గట్టి నిఘా

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రల నుంచి వేల సంఖ్యలో గంజాయి ఆకతాయిలు తరలివచ్చి ఫుడ్ సెంటర్లు, కిరాణా షాపులు, దాబాలను అణువుగా చేసుకొని విక్రయిస్తున్న గంజాయి విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు చేయాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్, సిఐ మీసాల చిన్నం నాయడుకు వినతిపత్రం అందజేశారు. జోరుగా షాపు యజమానుల ద్వారా గంజాయి విక్రయాలు కొనసాగిస్తున్నారని, దీనివలన నియోజకవర్గంలో యువత చెడు వ్యసనాలకు బానిసై ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రతి షాపులో తనిఖీలు నిర్వహించి గంజాయి ముఠాలను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, భాస్కరరావు, మండల నాయకులు చీకటి కృష్ణయ్య, కర్రి నాని, కర్రి జగదీష్, నాగేష్, పందిరి బాలకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగ పెన్షనర్ల ధ్రువపత్రాల పున్ణపరిశీలన శుక్రవారం కొనసాగుతోంది. గత కొన్నిరోజులుగా ఆస్పత్రిలో కంటి, ఆర్థో విభాగంలో ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పరీక్షలకు హాజరైన రోగులకు వైద్యబృందం పరీక్షలు నిర్వహించింది. అధికారుల సమక్షంలో రీవెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి స్పందన

మెళియాపుట్టి: మండలంలోని బందపల్లి గ్రామంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 300 మందికిపైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇసిజి, డిసిహెచ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 50 గిరిజన గ్రామాల గిరిజన ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బైరిసింగి లక్ష్మీనారాయణ, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖరరెడ్డి, గిరిజన సంఘం నాయకురాలు బైరిసింగి భరణి, శ్రీధర్, సాంబమూర్తి, జెమ్స్ మార్కెటింగ్ మేనేజర్ తిరుపతి, పిఆర్ఒ రవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజయపథంలో సాగాలి

సోంపేట: విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమని, విద్యార్థులు విజయ పథంలో సాగాలని ప్రముఖ మనోవికాస నిపుణులు రాంబుడ్డి గణపతి అన్నారు. శుక్రవారం మండలంలోని గొనకపాడు ఉన్నత పాఠశాలలో 'జీవిత పాఠం - జీవన నైపుణ్యాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో జయాపజయాలు ఉంటాయన్నారు. కాలాన్ని వృథా చేయరాదని ధైర్యంతో ముందుకు పోతే సానుకూల విజయాలు సాధించవచ్చని తెలిపారు. హెచ్‌ఎం టి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామ్‌బుడ్డి గణపతి

సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలం గ్రామ పంచాయతీ ఎస్‌సి కాలనీ అభివృద్ధి చేసి తీరుతానని మాట ఇచ్చిన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లంక శ్యామలరావు, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకట రమణ, జనసేన నాయకుడు సువ్వాడ రామారావు, దుర్గాసి శ్రీను, గొర్లె రమణ, పిన్నింటి రమణ, పిన్నింటి పైడితల్లి, అప్పారావు, గోవిందు, ప్రేమ కేశ్వరరావు, సీతారాం, గొర్లె గోవింద, రమణ యువత పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

ప్రతిభా పరీక్షలకు ఆహ్వానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండల స్థాయి ప్రతిభా పరీక్షలకు ఆహ్వానిస్తున్నట్లు కంబాల రాయుడు పేట మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం లఖినాన కరుణాకర్ అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో గ్రామపెద్దలు ప్రతిభా పరీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న పరీక్ష నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని, నవంబర్ 3లోగా జట్టు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. అక్టోబర్ నెల సిలబస్ వరకు ప్రశ్నలు అడుగుతారని, మరిన్ని వివరాలకు 9177305519, 9502420438 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వంక చిరంజీవి, మాజీ సర్పంచ్ కంబాల దానేసు, ఎంపిటిసి కారి వెంకటరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి- కవిటి

చేసిన సేవలే ఉపాధ్యాయుడికి గుర్తింపునిస్తాయని ఎంఇఒలు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ అన్నారు. మండలంలోని ముత్యాలపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాల, పెద్ద కపాసుకుద్ది జెడ్‌పి ఉన్నత పాఠశాల పరిధిలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బదిలీ ఉపాధ్యాయులు బల్లెడ భారతీదేవి, శ్రీరామ్ మూర్తి బిసాయి, రంగారావు, సురేష్, శ్రీదేవి, నివేదిత, మేరీ గ్రేస్‌లను పాఠశాల ఉపాధ్యాయ వర్గం, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు ఘనంగా సన్మానించి వారి కృషిని కొనియాడారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌ఎం చిత్రి ఈశ్వరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జల్లు విజయలక్ష్మి, కపాసుకుద్ది పంచాయతీ ఉప సర్పంచ్ పాతిన చంద్రశేఖరం, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు వడ్డి రాజేష్, గ్రామ పెద్దలు పాతిన వెంకటరావు, కోనారి కృష్ణారావు, పద్మనాభం, ఉపాధ్యాయులు శివ, హారిక తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎంఇఒలు తదితరులు

జిఎస్‌టి రాయితీ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా ప్రజలు జిఎస్‌టి రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జిఎస్‌టి నోడల్ అధికారి స్వప్నదేవి అన్నారు. ఎన్‌టిఆర్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌ను శుక్రవారం పరిశీలించారు. నిత్యావసర వస్తువులు, మందులు, కార్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు మొదలగు అన్నిరకాల వస్తువులపై రేట్లు ప్రభుత్వం తగ్గించిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఎగ్జిబిషన్ 13న ప్రారంభం కాగా 19వ తేదీతో ముగుస్తుందన్నారు. ప్రతి సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ జరుతోందన్నారు. ప్రతి కొనుగోలుపై లక్కీ కూపన్లు ఇవ్వడం జరుగుతుందని, 19వ తేదీన భారీ క్రాకర్ షో జరుపబడుతుందని, అదే రోజున ఈ వారం రోజులు చేసిన కొనుగోళ్ళపై లక్కీ డ్రా తీయబడుతుందని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ఆకర్షనీయమైన బహుమతులు ఇవ్వబడునన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని పలు షాపుల్లో జిఎస్‌టి అమలుపై మండల అధికారులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత షాపుల్లో తనిఖీలు నిర్వహించి, జిఎస్‌టిని పక్కాగా అమలు చేయాలని వ్యాపారులకు సూచించారు. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒలు ఎస్.దేవేం దరరావు, ఎం. పద్మనాభరావు, హౌసింగ్ ఎఇ గణేష్ కుమార్, ఎఒ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కవిటి: జిఎస్‌టి సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఆటవస్తువుల దుకాణాల్లో జిఎస్‌టి తగ్గిన పన్నుల ప్రయోజనాలపై ఎంపిడిఒ త్రినాథ్ దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఎఒ శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ ఎఇ రఘు తదితరులు పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగం

కొత్తూరు: కులం పేరుతో అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న తహశీల్దార్ బాలకృష్ణపై చర్యలు తీసుకువాలని మండలం దళిత నాయుకులు టొంపల వెంకట్రావు, గోపి, సమ్మన ఉదయ్ కుమార్, వడమ శ్రీను అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో తహశీల్దార్ స్టేజ్ పై నిబంధన ప్రకారం ఎవరు ఉండాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాంబాబును అడగ్గా ఎంపిపి అనుమతితో వైస్ ఎంపిపి ఉండొచ్చన్నారు. ఈ సమావేశంలో ప్రోటోకాల్ రగడకు దారితీసిందని, వేదికపై వైస్ ఎంపిపిలు కూర్చోవడం ఏంటని ప్రశ్నిస్తూ వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీ వరప్రసాద్‌ని దుయ్యబట్టారన్నారు. తహశీల్దార్ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని, పొజిషన్ సర్టిఫికెట్ సంబంధించి తహశీల్దార్‌పై రగడ నడుస్తున్న క్రమంలో సర్వసభ్య సమావేశంలో రగడ సర్వత్రా ప్రజా ప్రతినిధుల్లో చర్చకు దారితీసిందని, ప్రజాప్రతినిధులపై దురుసుగా

మాట్లాడుతున్న దళిత నాయకులు

ప్రవర్తించడం సరి కాదన్నారు. మహిళలపై అనుచితంగా ప్రవర్తించడం సబబు కాదన్నారు. ప్రజావ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న తహశీల్దార్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కర్లెమ్మ ఎంపిటిసి వడ్డీ గౌరీ కుమార్, జెఎసి నాయకులు, సర్పంచ్ పుచ్చ అప్పారావు, చింతాడ శ్రీను, ధూళి దాలయ్య, పసుపురెడ్డి అశోక్ కుమార్, ఎండు నాయుడు, బలగ సింహాచలం, బైరి సింహాచలం, తలసాని శ్రీను, లోపింటి అప్పలస్వామి, చిన్నారావు, ధూళి ఇల్లయ్య, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి- పలాస

పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శ్రీ సాయి శిరీష డిగ్రీ కళాశాలలో డాక్టర్ షీలా కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. 280 మందికి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 85 విద్యార్థులకు లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ తరం పిల్లలకు కంటి లోపాలు సర్వసాధారణం అయిపోయాయని, అందుకు కారణం సరైన పోషకాహారాలు సరిగ్గా తినకపోవడం, గంటల తరబడి సెల్‌ఫోన్లు చూస్తూ ఉండడమే కారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బి.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ మేఘూరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దానుగోరలో డిప్యూటీ ఎంపిడిఒ పర్యటన

పలాస: పలాసలోని దానుగోరలో డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వైకుంఠరావు శుక్రవారం పర్యటించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ పోస్టర్లు పంపిణీ చేశారు. ఐవిఆర్‌ఎస్ కాల్స్, చెత్త సేకరణపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తద్వారా సంపద సృష్టించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి, క్లాప్ మిత్రలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నందిగాం : ఖరీఫ్ సీజన్‌లో సాంబమసూరి, స్వర్ణ వంటి రకాలకు సుడిదోమ ఆశించిందని నివారణకు ఎస్పేట్ మందును పిచికారి చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె జగన్ మోహనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద తామర పల్లిలో పంట పొలాలను పరిశీలించారు. సుడిదోమ ఆశించిన పొలాల్లో ఎస్పేట్ 1.5 గ్రాముల మందును లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని లేదా ప్రమీట్రోజన్ 0.6 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మండల ఎఒ పి.శ్రీకాంత్ వర్మ, రైతులు పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్‌ను కలిసిన రైస్ మిల్లర్లు

కోటబొమ్మాళి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ బగాది శేషగిరిని ఆయన కార్యాలయంలో శుక్రవారం మండల రైస్ మిల్లర్లు సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల శేషగిరిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడడంతో ఆయనకు మిల్లర్లు సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు ఎస్. లక్ష్మణరావు, కోరాడ గోవిందరావు, పెద్ద గోవింద, బోయిన శివ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌లో కార్యకర్తలే ఫిర్యాదు చేయొచ్చు

నరసన్నపేట: మండలం దూకులపాడులో దూకులపాడు-గొట్టిపల్లి క్లస్టర్ పరిధి రచ్చబండ (కార్యకర్తలతో కృష్ణచైతన్య) శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో సంక్షేమం కంటే కక్షలకే అధిక ప్రాధాన్యమిస్తున్నారని, వైసిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయడమే కూటమి లక్ష్యంగా పాలన కొనసాగుతుందన్నారు. కార్యకర్తలకు జరిగిన అన్యాయాలను, కష్టాలను కార్యకర్తలే నేరుగా డిజిటల్ బుక్‌లో నమోదు చేయవచ్చునని సూచించారు. కార్యకర్తలకు అండగా ఎల్లప్పుడూ ఉంటామని భరోసా ఇచ్చారు. వైసిపి కార్యకర్తలకు రాబోయే జగనన్న పాలనలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి

మాట్లాడుతున్న కృష్ణచైతన్య

శ్యాం ప్రసాద్ రెడ్డి, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవి, రాష్ట్ర పొందర కూరకుల అధ్యక్షులు అప్పన్న, రమణయ్య, నర్సింగరావు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డిసిసిబి చైర్మన్, అధికారులు

సరుబుజ్జిలి: రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని అధిక దిగుబడులను సాధించాలని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని షలంత్రి, విజయరాంపురం గ్రామాల్లో పిఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా రైతులకు అవగాహన, శిక్షణను జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయంపై యువతలో ఆసక్తి పెంచడం సమాజానికి శ్రేయస్కరమన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి. చిట్టిబాబు మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులతో సాగు చేపడితే అధిక దిగుబడులు సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రేణుక సాయి, మండల వ్యవసాయ అధికారి కె.మన్మధరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మూలపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం మూలపేట గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యదర్శి కె.అనిల్ ప్రభాస్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో మురుగు కాలువలు, వీధులను శుభ్రం చేయించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించారు. వీధులను శుభ్రపరిచి మురికి కాలువల్లో చెత్తను తొలగించారు. అలాగే బ్లీచింగ్ పౌడర్ చల్లారు. చెత్తను వీధుల్లో వేయవద్దని గ్రామస్తులకు కార్యదర్శి సూచించారు.

కాలువలో పూడికలు తీస్తున్న పారిశుధ్య కార్మికులు

శక్తి యాప్‌తో రక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం ఇన్‌ఛార్జి నారాయణరావు, గిరి ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలకు శక్తియాప్ రక్షణగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర సమయంలో వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా యాప్‌ను డెమో రూపంలో వివరించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు జనార్ధన ఉన్నారు.

రణస్థలం: మండలంలోని కొవ్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో నారీశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ మోసాలు, సోషల్ మీడియా వేధింపులు, ఆన్‌లైన్ భద్రతపై వివరించారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పలాస: ఉద్యోగులు ఎదుర్కుంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాల్ కోరారు. మండలం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయ ఉద్యోగులతో ఎపిఎన్‌ఎన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఉంటూ ప్రజాసంక్షేమ పథకాలు, నిర్దేశించే పనులు చేపట్టడం జరుగు తుందన్నారు. ప్రభుత్వం గుర్తించి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సిహెచ్ రఘురాం, కార్యదర్శి సద్గుణరావు, సిహెచ్ ఆదమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, పద్మావతి ఆరోగ్య సిబ్బంది మేరి, విమల, త్రివేణి, సచివాలయ సిబ్బంది హర్ష, లోలక్ష్మి, సుమతి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌తో ప్రయోజనం

ఆమదాలవలస: ప్రజాదర్బార్ కార్యక్రమంలో పేద దళితులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీకి చెందిన పలువురు తమ సమస్యలపై అర్జీలు అందించారు. టిడిపి నాయకులు కూన ఆంజనేయులు, పివికె రాజు, నాగళ్ల మురళీధర్ యాదవ్, రాము, జి.రమణమూర్తి పాల్గొన్నారు.

పిఎం స్వానిధిపై అవగాహన

ఆమదాలవలస: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పిఎం స్వానిధి పథకంపై స్వయం సహాయక సంఘాల మహిళలకు, వీధి వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అధ్యక్షతన అవగాహన కల్పించారు. స్ట్రీట్ వెండర్‌లు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా కల్పిస్తున్న రుణ సదుపాయాలు, పథకం మార్గదర్శకాలు, డిజిటల్ చెల్లింపుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా స్ట్రీట్ వెండర్లు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి రుణ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ నరేష్ కుమార్, మెప్మా టిఎంసి ఎస్.వి. రత్నం, సిఒ నాగమణి, వినోద్, ఆర్‌పిలు, స్వయం సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సుమిత్ యువతకు ఆదర్శం

కవిటి: ముంబైలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్టెక్ ఫెస్ట్ - 2025 పోటీల్లో దేశవ్యాప్తంగా వచ్చిన ఆలోచనల మధ్య ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించిన రత్నాల సుమిత్ కుమార్ నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడని చింతామణి సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాండవ రామారావు అన్నారు. ఈ మేరకు మండలానికి చెందిన చింతామణి సొండికుల సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం జాడుపూడి గ్రామంలోని సుమిత్ నివాసానికి చేరుకుని సుమిత్ ప్రతిభను కొనియాడుతూ సుమిత్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను అభినందించారు. దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, జాడుపూడి బెలగాం సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.